హంసధ్వని - ఆది

తానేకాకెవ్వరు మాకు - దాతయుదైవము
లోనబెట్టుకొని మాకు - లోనైనవాడు

చదివించి, కూడువెట్టి - జారకుండ నిల్లు గట్టి
బెదురులేని బుద్ధి - పిన్ననాడే చెప్పి
యెదిరినడిగి ద్రవ్య - మిది గొమ్మనుచునిచ్చి
పదిలమై మమ్ము - బాలించువాడు

మోహవియోగమ్ము - మోహానురాగగమ్ము
దేహవిభాగంబు - దెలిసిన కలికి
ఐహికమున వేంకటాచ - లాధీశుడైసర్వ
దేహరక్షకుడై - తిరుగుచున్నాడు

అన్నమాచార్యులు దశావతారవర్ణనలో పాటించిన వైవిధ్యం, కల్పించిన వైచిత్రి అపూర్వమైనవి. ఆయన దశాధిక విధాల వర్ణించిన దశావతార సంకీర్తనలలో దశగణిత దశావతారుడైనాడు శ్రీవేంకటేశ్వర స్వరూప శ్రీమహావిష్ణువు. అల్పశబ్దంలో అనల్పార్థాన్ని ధ్వనింపజేసే మహాకవి కవితావైదగ్ధ్యమూ, తల్లిదండ్రులకు తనఎడగల ప్రేమాభిమానాలగూర్చి అప్యాయంగా, ముద్దు ముద్దు మాటలలో చెప్పు కొనేచిన్న అమాయకపు బాలకుని మౌగ్ధ్యమూ, విష్ణుతత్వాన్ని ఆమూలాగ్రం ఆకళింపు చేసుకున్న జ్ఞానయోగి భక్తిస్నిగ్ధతా ఈ సంకీర్తనంలో తొణికిసలాడుతున్నవి.

పాండురంగ మహాత్మ్యంలో రసజ్ఞకవిశేఖరుడు తెనాలి రామకృష్ణుని దశావతార వర్ణనమొక సీసపద్యం వున్నది. ఆ పద్యంలో అవలంబింపబడిన విధానంకూడా అత్యంత రమణీయమైనది.

సీ॥ నీటితో జివుకక నిలిచి క్రుమ్మరుపూన్కి
కఠిన కర్పరపు చుక్కాని బిగువు
దంష్ట్ర నెత్తిన మహీతలపుగాడుపు జీర
యురుదారు కలనయం దుదయమగుట
పరులకు తనకట్ల బలిమి చూపు విధంబు
పులిమిన నెత్రు గుగ్గిలపు నూనె

ద్వీపాంతరమునకు దెగువమైజనుపెంపు
చేముట్టు నాగంటి జీని తగులు
సౌగతాగమ మాలిమి శాస్త్రసరణి
వల్గు వలన చిత్ర దావనముగల్గు
నిన్నుదరిసేసి భవవార్ధి నిస్తరించి
దరిదరియకున్న గలదె ముదము

శ్రీమహావిష్ణుని దశావతారాల ఓడగా చిత్రించాడు రామకృష్ణుడు.

పద్యతాత్పర్యమిది.

శ్రీమహావిష్ణువు ఒక పెద్ద నావ. ఆ నావ నీటిలో చివికిపోకుండా, నానినా చెక్కు చెదరకుండా తిరుగుతూ ఉంటుంది. (మీనావతారం) దాని చుక్కానిగట్టి చట్రంలో బిగింపబడి (వీపు కఠినం - కూర్మావతారం), భూమిని కోరతో పైకెత్తినట్లు ఆనావ తెరచాప రెపరెపలాడుతుంది. (వరాహావతారం) కొయ్యస్తంభాలవల్ల నావ రూపుదిద్దు కుంటుంది. (నృసింహావతారం)

తన కట్టుబడి - మూడడుగులు నాకు సర్వజగమూ అన్న మాట అంతటి బలం గల దో బలికి చూపించిన వామనుడని ధ్వని - పూర్వకాలంలో నావలన పెద్ద పెద్ద కొయ్య దుంగలు చేర్చి బలమైన మోకులతో కట్టి బిగించేవారు. నావలోని కొయ్యదుంగల కట్టుబ డికీ వామనుడి మాటకట్టుబడికీ అభేదం. నావ అడుగుభాగాన, ప్రక్కలాఉన్న ఉపరితలా లకూ, మేకులవంటి లోహపు వస్తువులకీ తడి అంటి నిప్పు పట్టకుండా గుగ్గిలం నూనె వాడేవారు. అది ఎఱ్ఱగా ఉంటుందేమో రక్తం వరద కట్టించిన పరశురామత్వపు సూచ న, ద్వీపాంతరయానం చేసేది నావ ద్వీపాంతరం (శ్రీలంకకు)వెళ్లి జయించిన వాడు శ్రీ రాముడు. నావలంగరు నాగేటివలె ఉంటుంది. బలరాముడని వ క్రోక్తి, పడవపాట గీతా గానమై శాస్త్రాన్ని గీతగా బోధించిన శ్రీకృష్ణుడు, గుఱ్ఱపు స్వారీలాగ చిత్రమై కుదుపుల నా వ అది. (కల్క్యావతార ధ్వని) అలాటి నావపైన నిన్ను ఆశ్రయించి (ఎక్కి) సంసార సముద్రాన్ని దాటి,నీతో ఐక్యత చెందడమే బ్రహ్మానందం.

ఆ శ్రీవేంకటేశ్వరుడే కాక మాకు ఇంకెవ్వరు తల్లీ తండ్రీ. గురువూ మిత్రుడు మా సర్వస్వమూ శ్రీవేంకటేశ్వరుడు, ఆ శ్రీమహావిష్ణువు తనలోనే మమ్మందరినీ ఉంచుకొని మాఅందరి యందూ తానే నెలకొని ఉన్నాడు. అంటూ పల్లవిలో తిక్కనసోమయాజులు మహాభారతం శాంతిపర్వములో చెప్పిన భీష్మోక్తమైన విష్ణుమంత్ర ప్రభావ వివరణా ఘట్టంలో పద్యాన్ని పొదిగారు ఆచార్యులు.

హరియందేనును నాయం

దరయంగా హరియుగలము హరినాకునునా

హరికేను ననశ్వరులము

హరిప్రసాదోదయము మహత్తర మహిమన్:- ఈ పద్యంలో ఉన్నట్లుగానే జీవాత్మా పరమాత్మ లిద్దరూ ఒక్కటే. కానీ వారు రెండుగా భాసిస్తారు. ఇక్కడ 'హరి' 'నేను' అన్న పదాలకు పారమ్యమైన రూపం ఒక్కటే 'హరి'. ఈ విషయాన్ని సదాశివ బ్రహ్మేంద్రయతి ఒక కీర్తనలో ఇలా చెప్పారు.

తద్వజ్జీవత్వం బ్రహణి తద్వజ్జీవత్వం;;;;

యద్వత్తోయే - చంద్ర ద్విత్వం

యద్వన్ముకురే - ప్రతి బింబత్వం ॥ తద్వజ్జీవత్వం

ఏవిధంగా సరస్సనీటిలో చంద్రుడ రెండుగా గోచరిస్తాడో, ఎలాగైతే అద్దంలో ముఖం చూచుకుంటే మనకు ప్రతిబింబం గోచరిస్తున్నదో అదే విధంగా బ్రహ్మమొక్కటే ఒక్కటే. 'అంతర్బహిశ్చా నారాయణః' నిరంజనో నిష్కళంకో నిర్వికల్పో నిరాఖ్యాత శ్శుద్ధో దేవ ఏకో నారాయణః నద్వితీయో స్తికశ్చిత్ - య ఏవం వేద నవిష్ణురేవభవతి శుద్ధంగా ఈ సంకీర్తన పల్లవిలో అమర్చారు అన్నమాచార్యులు. చదివించి సోమకాసురుడెత్తుకొని పోయిన వేదవిజ్ఞాన సర్వస్వాన్ని వెతికి తెచ్చి యిచ్చి మాకు చదువు చెప్పించిన మీనావతారవిష్ణువు.

కూడువెట్టి - శరధి మథింపజేసి, హరిభక్తులైన దేవతలకు అజరామరమైన దివ్యాహారాన్ని, అమృతాన్ని తెచ్చియిచ్చిన కూర్మావతార విష్ణువు. (మేమూ (జగత్తంతా) హరిభక్తులమే. మాకూ యిచ్చాడు అమృతం హరి పదధ్యానామృతం, హరినామగానామృతం.)

జారకుండ నిల్లుగట్టి - ఈ భూమి సముద్ర పతనం కాకుండా గాపాడిన వరాహస్వామి

బెదురులేనిబుద్ధి పిన్ననాడే చెప్పి - ముల్లోకాలనూ గెలిచి, గడగడ లాడించిన

హిరణ్యకశిపుడంటే ఏమాత్రమూ భయములేని బుద్ధిని గర్భస్థ శిశువుగా ఉండగానే నారదునిచే చెప్పించిన నృసింహావతార విష్ణువు.

యెదిరినడిగి - శత్రువైన బలిని మూడడుగుల నేల దానమిమ్మన్న వామనావతార వర్థిష్ణువు:

ద్రవ్యమిది గొమ్మనుచునిచ్చి - బ్రాహ్మణులందరికీ భూమినంతా దానమిచ్చిన పరశురామ రూప శ్రీమహావిష్ణువు.

పదిలమై మమ్ము పాలించువాడు - జగత్తంటటికీ శ్రీరామరక్షగా రాజ్యమేలిన శ్రీరామధర్మ వర్తిష్ణువు.

మోహవియోగంబు - నిత్యం తీర్థయాత్రలకేగే బలరామ నిర్మోహచరిష్ణువు.

మోహానురాగంబు - విశ్వమంతటినీ మోహింపజేసే కృష్ణావతార రమాలంకరిష్ణువు.

దేహవిభాగంబు - స్త్రీశరీరం, పురుషదేహమూ కూడా కలిగిన కల్క్యవతార జిష్ణువు.

అతడే నేడు శ్రీవేంకటాచలపతియై జగద్రక్షణా దురంధరుడై ప్రపంచమంతా వ్యాపించి ఉన్నాడు.

అన్నమాచార్యుల ఈ దశావతార సంకీర్తనం తర్వాత కవులకు రామకృష్ణుని వంటి వారికి, ఆదర్శమూ మార్గదర్శకమూ అయినదనడం సత్యదూరం కాజాలదు.